
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 31.0 । కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

గురువారం 6 నవంబరు 2025

డివైడర్‌ను ఢీకొన్న బైక్

» ఇద్దరి మృతి, ఒకరికి గాయాలు


నరేశ్ (ఫైల్)


నాగరాజు (ఫైల్)

గద్వాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన యువకులు జములమ్మ స్టేజీ నుంచి పట్టణంలోకి మోటార్ బైక్‌పై అతివేగంగా వస్తూ రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. పోలీసులు, ప్రత్యక్షసాక్షుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని దొడ్డబండ (బృందావన్ కాలనీ)కి చెందిన బోయ నాగరాజు (33), నరేశ్ (32), కిషోర్‌లు మధ్యాహ్నం జములమ్మ స్టేజీ వైపు వెళ్లారు. సాయంత్రం తిరిగి పట్టణంలోకి ముగ్గురూ ఒకే మోటార్ బైక్‌పై వస్తున్నారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలో రోడ్డు డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో ముగ్గురూ రోడ్డుపై పడ్డారు. స్థానికులు పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. నరేశ్‌కు సీపీఆర్ చేస్తూ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గాయపడ్డ కిషోర్ అంబులెన్స్‌లో ఆసుపత్రి వరకు రాగా, ఇద్దరూ మృతి చెందారని తెలుసుకొని ఎవరికీ కనిపించకుండా ఆసుపత్రి నుంచి వెళ్లిపోయాడు. కాగా సంఘటనా స్థలాన్ని సీఐ టంగుటూరి శ్రీను పరిశీలించారు. మద్యం తాగి వాహనాన్ని అతి వేగంగా నడపడమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.


సోమశిల వద్ద కృష్ణానదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మహబూబ్‌నగర్‌లోని పరిమళ గిరిలో..

కోటి దివ్వెల.. కార్తీకం


వనపర్తిలోని రాజనగరం అయ్యప్పస్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


మహబూబ్‌నగర్‌లో కార్తీక దీపం వెలిగిస్తున్న మహిళ..

ఉమ్మడి జిల్లాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవ క్షేత్రాలు, ప్రముఖ ఆలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో మారుమోగాయి. కృష్ణానదిలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు.


పాలమూరులోని ప్రేమ్‌నగర్‌లో దీపం వెలిగిస్తున్న మహిళ

- భక్తిశ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు
- కృష్ణానదిలో బీచుపల్లి, సోమశిల వద్ద భక్తుల స్నానాలు
- ఆలయాల్లో దీపారాధన
- బీచుపల్లి, జోగుళాంబ, ఉమామహేశ్వరం వద్ద సందడి

అచ్చంపేట/ కొల్లాపూర్/ అలంపూర్/ ఎర్రవల్లి (గద్వాల)/ చిన్నచింతకుంట/కృష్ణ/వనపర్తి రాజీవ్ చౌరస్తా, నవంబరు 5 : (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలు దీపాల వెలుగులో కళకళలాడాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, కార్తీక దీపాలను వెలిగించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం ఉమామహేశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 3 బస్సుల్లో భక్తులు కొండపైకి చేరుకున్నారు. పాపనాశిని, నాగుల వైపు కొండచరియలు విరిగిపడి ఉండటంతో, ఆ మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆర్డీవో మాధవి ఈశ్వరుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్ఐ సద్దాం హుసేన్‌ల అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అలాగే నియోజకవర్గంలోని వల్కపల్లి శివాలయం, లింగాల కోదండరామాలయం, మద్దిమడుగు ఆంజనేయ స్వామి, ఉప్పునుంతల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి, పూజలు చేశారు.

సోమశిలకు పోటెత్తిన భక్తజనం

కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిలకు భక్తులు పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన జనం ముందుగా సప్తనదుల సంగమ ప్రదేశం వద్ద కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి, కార్తీక దీపాలను వెలిగించి నదిలో వదిలారు. అనంతరం లలితాంబికా సోమేశ్వర ఆలయంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలకు, ఆవరణలోని ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చన చేశారు. భక్తులకోసం కొల్లాపూర్ డిపో నుంచి సోమశిలకు ప్రత్యేక బస్సులు నడిపించారు.

జోగుళాంబ సన్నిధిలో చండీహోమం

జోగుళాంబ గద్వాల జిల్లాలోని

(మిగతా 6లో..)

సాహితీ సిపాయి కపిలవాయి


కపిలవాయి లింగమూర్తి

» నేడు కపిలవాయి ఏడవ వర్ధంతి 6

పీఎఫ్ సొమ్ము స్వాహా..!

» ప్రావిడెంట్ ఫండ్ సొమ్మును దోచుకుంటున్న ఏజెన్సీలు

» ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు టోకరా

» రాజకీయ నాయకుల అండదండలు!

» పట్టించుకోని జిల్లా యంత్రాంగం!



వనపర్తి వైద్యవిభాగం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఈ పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా పలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు స్వాహా చేస్తున్నాయి. వనపర్తి జిల్లా వ్యాప్తంగా దాదాపు 20 వరకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల నిర్వాహణ కొనసాగుతుండగా, అందులో 2 వేల మందికిపైగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మొత్తం డబ్బులు పొందుతూ ఉద్యోగుల వాటా ఈపీఎ ఫ్, ఈఎస్ఐ మాత్రం చెల్లించడం లేదు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే ఇలా జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా లక్షలాది రూపాయలను ఏజెన్సీలు స్వాహా చేస్తుండటం గమనార్హం.

దాదాపు 15 విభాగాల్లో..

జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 విభాగాల్లో ఏజెన్సీల నిర్వాహణ కొనసాగుతోంది. వాటి ద్వారా దాదాపు 2 వేలమందికి పైగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వరిస్తున్నారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకున్న ఏజెన్సీలు వారికి వేతనంతో పాటు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్, హెల్త్ ఇన్సూరెన్స్‌లను ప్రతీ నెల తప్పనిసరిగా జమ చేయాల్సి ఉంటుంది. ఉద్యోగుల బేసిక్ వేతనం నుంచి ఈపీఎఫ్ 12 శాతం, ఏజెన్సీల నిర్వాహకులు 13 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఈఎస్ఐ కూడా ఇదే విధంగా ఉంటుంది. కానీ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఏజెన్సీలు మాత్రం నిబంధనలను తుంగలో తొక్కి ఉద్యోగుల కడుపు కొడుతున్నాయి. ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసే సిబ్బంది ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

కలెక్టరేట్, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, జీజీహెచ్, ఎంసీహెచ్, టీ హబ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బ్లడ్ బ్యాంక్, ఐఎన్‌పీఆర్, మున్సిపాలిటీలు ఇలా అనేక చోట్ల ఏజెన్సీల నిర్వహణ కొనసాగుతుంది. వాటి ద్వారా 2 వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 20 మంది ఎన్‌హెచ్ఎం కింద ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 2023 మార్చి నెలలో విధుల్లో చేరారు. వారికి దాదాపు ఏడాదికిపైగా పీఎఫ్ డబ్బులు జమ కాలేదు. అంతేకాకుండా కలెక్టరేట్‌లో ఉన్న కొందరికి, టీహబ్‌లోని ఫార్మసిస్టుకు, డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు, బ్లడ్ బ్యాంక్‌లో ఉన్న ఉద్యోగులకు పీఎఫ్ డబ్బులు చెల్లించలేదు. ఆ సొమ్మును ఏజెన్సీలు స్వాహా చేస్తుంటే అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వస్తున్నాయి. అంతేకాకుండా ఏజెన్సీల నిర్వాహకులకు పుష్కలంగా రాజకీయ అండదండలు ఉండటంతో ఉద్యోగులు తమ సమస్యను ప్రస్తవిస్తే తొలగిస్తారేమోననే భయంతో గమ్మునుంటున్నారు.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు



కంపెనీ యజమానులు సక్రమంగా పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలి. జిల్లాలో కొందరు ఏజెన్సీల నిర్వాహకులు సక్రమంగా పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదు. దీంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ఉద్యోగులకు వేతనాలే సక్రమంగా అందడం లేదు. ఇక పీఎఫ్, ఈఎస్ఐ ఊసే ఉండటం లేదు. ప్రతీ నెలా వేతనాలతో పాటు, క్రమం తప్పకుండా పీఎఫ్ జమ చేయాలి.

- భరత్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అధికారులు పట్టించుకోవడం లేదు



ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు పీఎఫ్ చట్టానికి తూట్లు పొడుస్తున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లా పరిధిలో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల యజమాన్యాలు పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఏజెన్సీల గుర్తింపును రద్దు చేయాలి.

- పి. సురేశ్, రాష్ట్ర కార్యదర్శి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

పచ్చిమిర్చి కిలో రూ.100

» చిక్కుడు, బీర్నీస్‌లు కూడా అదే ధర

» గణనీయంగా పెరిగిన కూరగాయల ధరలు

» ఆందోళన చెందుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు


నాగర్‌కర్నూల్ రైతుబజారులో అమ్మకానికి ఉంచిన కూరగాయలు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గణనీయంగా పెరిగిన కూరగాయల ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలను భయపెడుతున్నాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో కూరగాయల తోటలు దెబ్బతినడంతో దిగుమతి తగ్గింది. దీంతో వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ధరలు రోజురోజుకూ అధికం అవుతున్నాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వారం రోజులుగా పెరుగుతున్న ధరలు

సాధారణంగా ఈ సీజన్‌లో కూరగాయల దిగుబడి పెరిగి, ధరలు తగ్గుతాయి. కానీ వారం రోజులుగా విపరీతంగా పెరుగుతున్నాయి. నిత్యం వినియోగించే ప్రధాన కూరగాయలు రూ. 70 నుంచి రూ. 100 వరకు ధర పలుకుతున్నాయి. నాగర్‌కర్నూల్ రైతుబజారులో పచ్చిమిర్చి, చిక్కుడు, బీర్నీస్ రూ.100 పలుకుతోంది. మిగతా కూరగాయలు కిలోకు రూ. 70 నుంచి రూ. 90 వరకు పలుకుతుండగా, కిలో టమాట రూ. 30 నుంచి రూ. 40 వరకు ఉంటోంది. అదే విధంగా ఆకు కూరలు గతంలో నాణ్యతను బట్టి రూ. 20కి 5, 6 కట్టలు ఇచ్చేవారు. ప్రస్తుతం 3, 4 కట్టలే ఇస్తున్నారు అలాగే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, రిటైల్ వ్యాపారులు రైతుబజారు ధరల కంటే రూ.10 నుంచి రూ.20 వరకు అధికంగా తీసుకుంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయని వ్యాపారులు చెప్తున్నారు. దీంతో దిగుబడి తగ్గి మార్కెట్‌కు డిమాండ్‌కు తగినంతగా రావడం లేదని, అందుకే ధరలు పెరిగాయని అంటున్నారు.

రైతుబజారులో ధరలు ఇలా..

కూరగాయలు	ధర(కిలో)
టమాట	40
వంకాయ	70
పచ్చిమిర్చి	100
బెండకాయ	90
గోకరకాయ	80
బీరకాయ	80
కాకరకాయ	90
చిక్కుడు	100
బీర్నీస్	100
ఆలుగడ్డ	40


కొనలేకపోతున్నాం



రైతుబజారులో కూడా కూరగాయల ధరలు బాగా పెరిగాయి. ఏది కొన్నా కిలో రూ. 100కు తక్కువగా లేదు. మాలాంటి కూలీ జనం అంత ధరకు కొనలేకపోతున్నాం. రూ.500 ఖర్చు చేసినా వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. దీంతో రోజూ ఒక్క కూరతోనే సరిపెట్టుకుంటున్నాం.

- లింగస్వామి, వినియోగదారుడు, ఎండబెట్ల

దూరం నుంచి తెప్పిస్తున్నాం



భారీ వర్షాలతో ఇక్కడి తోటలు చాలా వరకు పాడైపోయాయి. మార్కెట్‌కు కూరగాయలు సరిగా రాకపోవడంతో, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దీంతో రవాణా చార్జీలతో కలిపి విక్రయించాల్సి వస్తోంది. వర్షాలు తగ్గితే ధరలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

- మురళి, హోల్‌సేల్ వ్యాపారి, నాగర్‌కర్నూల్

ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ 6

మతోన్మాదం ప్రగతికి ప్రమాదకరం

అచ్చంపేటలో కమ్యూనిటీ కాంటాక్ట్

» శివసాయినగర్ కాలనీలో పోలీసుల తనిఖీలు

» 60 ద్విచక్ర వాహనాలు, కారు, బొలెరో స్వాధీనం


వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

అచ్చంపేట టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలో బుధవారం తెల్లవారుజామున పోలీసు శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని శివసాయినగర్ కాలనీలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్ఐలు సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 60 బైక్‌లు, ఒక కారు, ఒక బొలెరో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పట్టణ శివారు కాలనీల్లో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించుకున్న ఇళ్లకు సెంట్రల్ లాక్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలనీల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని, లేదా ఎస్ఐ, సీఐలకు సమాచారం అందించాలని సూచించారు. తమ సిబ్బంది తక్షణమే స్పందిస్తారని చెప్పారు. కాలనీల్లో అందరి సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు సరైన ధ్రువపత్రాలను సమర్పిస్తే తిరిగి అప్పగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో 8 మంది ఎస్ఐలు, 60 మంది పోలీసులు పాల్గొన్నారు.




ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 120.00
హోల్ సేల్	: 129.00
డ్రెస్డ్	: 203.00
స్కిన్ లెస్	: 231.00

సాహితీ సిపాయి కపిలవాయి


కపిలవాయి లింగమూర్తి

నాగర్‌కర్నూల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు పండితుడిగా సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించిన కపిలవాయి లింగమూర్తి, అరుదైన రచనలతో అశేషమైన అభిమానులను సంపాదించుకున్నారు. ప్రధానంగా పరిశోధనా వ్యాసాలు, భక్తి సంబంధమైన అంశాలు, గ్రామీణ మాండలికాలు, శతకాలు, రచనలు, కావ్యాలు, నవలలు, కథలు, స్థల చరిత్రలు తదితర అంశాలపై ఆయన దృష్టి సారించారు. కవితా కళానిధిగా ప్రసిద్ధి పొందిన ఆయన ప్రాచీన తాళపత్ర గ్రంథాలను అధ్యయనం చేసి వాటి విశేషాలను సమాజానికి పరిచయం చేశారు. పాలమూరు జిల్లా సర్వస్వం, ఇదే జిల్లాలో ఒక్కో ప్రాచీన దేవాలయానికి సంబంధించిన విశిష్టతలు, వాటి ప్రాధాన్యం, స్థల పురాణం తదితరాలపై ఆయన విశ్లేషణలు చిరస్మరణీయం. తెలుగు భాషా పండితుడిగా సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన దాదాపు 158 రచనలు చేసి, 157 పుస్తకాలను ప్రచురించారు. సాహిత్య సమాజానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా అనేక పురస్కారాలు, బిరుదులు వరించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కవి దిగ్గజాల్లో ఆయన కూడా ఒకరని పేర్కొనడంలో అతిశయోక్తి లేదు.

- పరిశోధన, ఆధ్యాత్మిక, సాహితీ రంగాల్లో విశేషసేవ
- అరుదైన రచనలతో రాష్ట్రాంతర ఖ్యాతి
- నేడు కపిలవాయి ఏడవ వర్ధంతి

కపిలవాయి జీవన ప్రస్థానం

డాక్టర్ కపిలవాయి లింగమూర్తి 1928, మార్చి 31న అచ్చంపేట నియోజకవర్గం, బల్మూరు మండలంలోని జిన్కుంట గ్రామంలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు జన్మించారు. తెలుగు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంవోఎల్ పట్టా పొందిన ఆయన, 1974, జూలై 11న నాగర్‌కర్నూల్ పట్టణంలోని జాతీయ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. చివరగా పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాశ్య కళాశాలలో ఉపన్యాసకులుగా పని చేసి, 1983, ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ చేశారు. ఆ తర్వాత సాహిత్య రంగానికి సేవలందించడమే కర్తవ్యంగా భావించి 158 పరిశోధనాత్మక, ఆధ్యాత్మిక రచనలు చేశారు. ఆయన సాహితీ సేవకు గుర్తింపుగా 64 పురస్కారాలు, 8 బిరుదులు పొందారు. ఆయన సాహిత్యంపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆరు యూనివర్సిటీలలో ఆరు పరిశోధనలు జరిగాయి.

తన శిష్య బృందంలోని కవులు, కళాకారులు రచించిన 290 పుస్తకాలకు పీఠికలు రాశారు. మారుమూల అచ్చంపేట నియోజకవర్గంలో జన్మించిన కపిలవాయి లింగమూర్తి బాల్యంలో అనేక కష్టాలను ఎదుర్కొని మేనమామల వద్ద ఉండి విద్యనభ్యసిస్తూనే జీవితం, సాహిత్య రంగాలను సమానంగా చూస్తూ వచ్చారు. నిజ జీవితంలో ఆర్థికంగా ఎదురయ్యే కష్టాలను అధిగమిస్తూనే జీవితాన్ని, సాహిత్యాన్ని సమాంతరంగా లాక్కొచ్చారు. కపిలవాయి లింగమూర్తి రచనల పట్ల సాహిత్య విమర్శకులు కూడా ఇప్పటి వరకు ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం ఆయన రచనల్లో వాస్తవికతకు నిదర్శనంగా చెప్పొచ్చు.

పూర్వజన్మ సుకృతం



అంపశయ్యపై ఉన్నా సాహిత్యమే ఊపిరిగా జీవించిన కపిలవాయి లింగమూర్తి ఈ ప్రాంతంలో జన్మించడం జిల్లా వాసుల పూర్వజన్మ సుకృతం. ఆధ్యాత్మికత, పరిశోధనాత్మక, స్థల పురాణాల విషయంలో ఆయన రచనలు నేటి యువ కవులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

- వనపట్ల సుబ్బయ్య, ప్రముఖ కవి

అందుకున్న పురస్కారాలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకే కలికితురాయిగా నిలిచిన కపిలవాయి లింగమూర్తి అనేక పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు. 2014లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 2016లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట పురస్కారాన్ని గవర్నర్ ఎస్ఎల్.నరసింహన్, ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ చేతుల మీదుగా అందు కున్నారు. అంతే కాకుండా సీపీబ్రౌన్, బూర్గుల రామకృష్ణారావు పురస్కారాలు కూడా ఆయనను వరించాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ కూడా సప్తతి విశిష్ట పుర స్కారాన్ని అందించింది. కవి కేసరిగా బిరుదు పొందిన ఆయన, కవితా తపస్వీ, కవితా కళానిధిగా ప్రఖ్యాతి గాంచారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ


సిర్సవాడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

తాడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలు, దుందుభీ నదిఎగువ ప్రాం తంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రెండు రోజులుగా దుందుభీ నది ప్రవాహం పెరుగుతూ వస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ ప్రవాహం బుధవారం ఉధృతి పెరిగింది. మండలం లోని అంతారం, నాగదేవ్‌పల్లి, మేడిపూర్, పొల్మూరు, గుట్టలపల్లి గ్రామాల వద్ద దుందుభి నది ప్రవాహం ఉధృతంగా ఉంది. దీంతో నది పరివాహక ప్రాంత గ్రామాలల్లో నదిలోకి ఎవరూ వెళ్లకూడదంటూ ఎస్ఐ గురుస్వామి సమాచారమిచ్చారు.

పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరిస్తా

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి


నాగర్‌కర్నూల్ పట్టణంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సమావేశంలో పాల్గొన్న మునిసిపల్ అధికారులు, సిబ్బంది

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలే కురిసిన భారీ వర్షాల కారణంగా నాగర్ కర్నూల్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారాని కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నా రు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మునిసిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో ఉన్న తాను నిన్న కురిసిన భారీ వర్షంతో పట్టణ ప్రజలు అవస్థలు పడ్డ సంఘటన తెలుసుకుని వెంటనే ఇక్కడికి వచ్చానన్నారు. పట్టణంలో ఎక్కడెక్కడ వర్షపు నీరు కాలనీల్లోకి చేరిందో గుర్తించి అక్కడ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలు సుకొని డ్రైనేజీల శుభ్రం, నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని మునిసిపల్ అధికారులకు సూచించారు. పట్టణ ప్రజలు మరోమారు వరదల ప్రభావానికి గురి కాకుండా శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలకు ప్రణాళికలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిష నర్ నాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు జక్కా రాజ్‌కుమార్, తీగల సునేంద్ర పాల్గొన్నారు.


వర్షాలకు వరి నేలమట్టం

- ఆందోళనలో రైతులు


మాగనూరులో నేలకొరిగిన వరి పైరు

నారాయణపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా చేతికొచ్చిన వరి పంటపై అధిక అధిక వర్షాల ప్రభావం పడింది. పంట నేలకొ రుగుతూ అపారనష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అడపదడపాగా వర్షా లు కురుస్తుండంతో కోసేందుకు సిద్ధంగా ఉన్న వరి వాలిపోతుంది. దీంతో వర్షపు నీటిలో వరి కొయ్యలు చిక్కుకొని మొలకెత్తుతూ నల్లబారి పో తుండడంతో రైతన్నల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో నారాయణపేట, ఊట్కూర్, ధన్వాడ, మాగనూర్, కృష్ణ, మక్తల్ మండలాల్లో వరి రైతాంగానికి అపార నష్టం తెచ్చింది. అధి కారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారా న్ని అంచనా వేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలో 1.70 లక్షల ఎకరాల్లో వరి


ఊట్కూర్ మండలం పెద్దజట్రంలో నేలకొరిగిన వరి పైరు

వానాకాలంలో జిల్లా వ్యాప్తంగా 1.70 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. పది రోజుల నుం చి కోతలు ప్రారంభమయ్యాయి. రోజూ వర్షం కురిసి గాలులు వీస్తున్నాయి.

పంట నల్లబారింది



నాలుగు ఎకరాలు బోరు కింద వరి సాగు చేశా. అధిక వర్షాలకు చేతికి వచ్చిన పంట మొలకెత్తి నల్లబారింది. రూ.1.20 లక్షల పెట్టుబ డి పెట్టి నీటి పాలైంది. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- నీరటి అంజప్ప, రైతు, పెద్దజట్రం

మతోన్మాదం ప్రగతికి ప్రమాదకరం

- కవి జనజ్వాల రాధాకృష్ణ


జనజ్వాల మహా కవిత్వం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మతోన్మాదం పెరగడం దేశ ప్రగతికి ప్రమాదకరమని కవి జనజ్వాల అన్నారు. ఆయన రచించిన 'జనజ్వాల మహా కవిత్వం' పుస్తకాన్ని బుధవారం భారత విప్లవోద్యమ నిర్మాత చంద్రపుల్లారెడ్డి 41వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనజ్వాల మాట్లాడుతూ పాలకులు బడుగు, బలహీన వర్గాల్లో మతాన్ని ఎక్కించి సమస్యలపై పోరాడకుండా పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. దేశంలో ఉండే 90 శాతం మంది పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు బలహీన వర్గాలకు వామపక్ష భావజాలమే అండగా నిలుస్తోందన్నారు. వామపక్ష భావజాలం ఉన్నవారందరూ పార్టీలకతీతంగా ఏకమై సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా చైతన్యానికి ప్రతిబంధకంగా పరిణమిస్తున్న మతం, కులం, జాతి వివక్షను ఎదుర్కోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేశ్, డాక్టర్ భగవంతు, కొంకల నారాయణ, గణేశ్, కేశవులు, వెంకటేశ్, మోషా, శ్రీరాం, గోపాలకృష్ణ, శ్రీహరి, రవిచంద్ర, రక్షిత, కుతుబ్, అరవిందు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిన్నింగ్ మిల్లుల సమ్మె

- స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి
- అన్ని మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- డిమాండ్ చేస్తున్న మిల్లుల యాజమాన్యాలు


తాడూరులోని పత్తి జిన్నింగ్ మిల్లు

జడ్చర్ల/ తాడూరు/పాలమూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలను నిరసిస్తూ గురువారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మహబూబ్‌నగర్ పరిధిలోని ఓబ్లాయపల్లి, జడ్చర్ల పరిధిలోని రాజీపేట, కౌరంపేట, పట్టణంలోని జిన్నింగ్ మిల్లులు కూడా సమ్మెకు దిగుతున్నట్లు యజమానులు ప్రకటించారు. సీసీఐ కేటాయించిన రేటింగ్ ఆధారంగా ఎల్ 1గా ఉన్న జిన్నింగ్‌మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాలను గత పదిరోజులు క్రితం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించారు. కాగా ఎల్ 1 గా ఉన్న జిన్నింగ్‌మిల్లులకు పత్తి రైతులు అధికంగా రావడంతో పాటు కొన్ని ప్రాంతాల రైతులకు రవాణాకు దూరంగా ఉండడంతో ఎల్ 2 కేటగిరిలో ఉన్న జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను గడిచిన రెండు, మూడు రోజులలో ప్రారంభించారు. రెండు కేటగిరిలలో ఉన్న జిన్నింగ్ మిల్లులలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో తామంతా వ్యాపారం లేక ఖాళీగా ఉంటున్నామని, కేటగిరిలను ఎత్తివేసి అన్ని జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను మిల్లు యజమానులు తీసుకువచ్చారు. రైతులందరి వద్ద స్మార్ట్ ఫోన్‌లు ఉండవు కాబట్టి, స్లాట్‌బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నారు. రైతులు స్వేచ్ఛగా పత్తిని విక్రయించుకునేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పత్తి కొనుగోలు పరిమితిని ఎకరానికి 12 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు కుదించడం, తేమ నిబంధన, అన్ని జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 30 జిన్నింగ్ మిల్లులుండగా, 7 మిల్లుల్లోనే పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో పత్తి రైతులకు మిల్లుల యజమానులు సమాధానం చెప్పుకోలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కాగా ఇప్పటికే కొందరు రైతులు తమ పత్తిని విక్రయించేందుకు స్లాట్‌లను బుక్ చేసుకున్నారు. స్లాట్ ప్రకారం పత్తిని విక్రయించేందుకు సీసీఐ కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులు జిన్నింగ్ మిల్లులు సమ్మె బాట పట్టిన కారణంగా ఇబ్బందులకు గురయ్యే అవకాశం నెలకొంది. జిన్నింగ్ మిల్లులో కొనుగోలు చేస్తున్నారా.? లేదా అనే అంశాన్ని తెలుసుకుని తమ పత్తిని తేవాలని పత్తి రైతుల కు మార్కెటింగ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

కోటి దివ్వెల కార్తీకం

(5వ పేజీ తరువాయి)

అలంపూరు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా అమ్మవారి యాగశాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు చండీహోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు చేసి, దీపాలను వెలిగించి నదిలో వదిలారు. అలాగే జోగుళాంబ, బాలబ్రహ్మేంద్ర స్వామి వార్లను దర్శించుకొని, ఆలయాల ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించారు.

భక్తులతో కిటకిటలాడిన బీచుపల్లి

పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామునే కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి, ఆంజనేయ, ఈశ్వర, రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకుడు మారుతాచారి, ఈవో రామన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో కృష్ణానదికి దశవిధ హారతులతో ప్రత్యేక పూజలు చేశారు.

కురుమూర్తిలో ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు బుధవారం అధిక సంఖ్యలో తరలొచ్చారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి రాజగోపురం నుంచి గర్భ గుడి వరకు మెట్టు మెట్టుకు దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. దా సంగాలు సమర్పించారు. చిన్న వడ్డెమాన్ గ్రామ సమీపంలోని రామలింగేశ్వర స్వా మి శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిం చి, అభిషేకాలు చేశారు.


వనపర్తిలోని శివాలయంలో అభిషేకం చేస్తున్న న్యాయాధికారి శ్రీలత

తంగిడిగి వద్ద

నారాయణపేట జిల్లా కృష్ణ మండలం లోని తంగిడిగి వద్ద కృష్ణా నదిలో భక్తులు స్నానాలు చేశారు. కృష్ణ, భీమా నదుల సంగమ క్షేత్రంలోని దత్త భీమేశ్వర దేవాలయం, ముడుమాల్ యాదవేంద్ర స్వామి, కూసుమూర్తి శ్రీకృష్ణ ద్వాపయన దేవాలయం, స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దీపాలు వెలిగించి, నదిలో వదిలారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో..

వనపర్తి జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి, న్యూగంజ్ లక్ష్మీ గణపతి దేవాలయం, రామాలయాలతో పాటు, రాజనగరం అయ్యప్ప స్వామి దేవాలయాల్లో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. న్యూగంజ్ గణపతి గుడిలోని శివాలయంలో ఫస్ట్ అడిషినల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీలత కుటుంబ సభ్యులతో కలిసి అభిషేకం చేశారు.


సోమశిల వద్ద కృష్ణానది ఒడ్డున కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు


అలంపూర్ వద్ద తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

భర్త వివాహేతర సంబంధం

- భర్త కుటుంబ సభ్యులపై భార్య బంధువులు మారణాయుధాలతో దాడి
- తండ్రి, తల్లి, తమ్ముడి పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడ్డ అలివేలను ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తున్న బంధువులు

కల్వకుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం రెండు కుటుంబాల మధ్య తీరని విషాదాన్ని నింపింది. భర్త కుటుంబ సభ్యులపై భార్య కుటుంబ సభ్యులు, బంధువులు మారణాయుధాలతో దాడి చేయగా ముగ్గురు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఈ సంఘటన బుధవారం చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ఇలా ఉన్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని సంజాపూర్ గ్రామానికి చెందిన మల్లేష్‌కు వెల్దండ మండలం చెర్కూర్ గ్రామానికి చెందిన శిరీషతో రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. ఓ కూతురు కూడా జన్మించింది. మల్లేష్ భార్యను కాదని మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడు. దీంతో వారి కుటుంబాల మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. మల్లేష్ మళ్లీ మూడు నెలల క్రితం వివాహేతర సంబంధం గల మహిళతో వెళ్లిపోయాడు. శిరీష ఆమె కూతురు పేరు మీద భూమి పట్టా చేయాలనే విషయంలో తగాదా కూడా నెలకొని ఉన్నది. దీంతో కోప్రోదిక్తులైన శిరీష అన్నలు శివ, ప్రశాంత్‌లతో పాటు వెల్దండకు చెందిన వారి మిత్రులు రామకృష్ణ, వెంకటేశ్, నరేష్, సుభాష్‌లను తీసుకొని బుధవారం సంజాపూర్ గ్రామానికి వెళ్లారు. శిరీష భర్త మల్లేష్ లేకపోవడం, మల్లేష్ తండ్రి జంగయ్య, తల్లి అలివేల, తమ్ముడు పరమేశ్‌లు వ్యవసాయ పొలం వద్ద ఉండటాన్ని గుర్తించారు. దీంతో ఆ ముగ్గురిపై శిరీష అన్నలతో పాటు వచ్చిన మరో నలుగురు కలిసి గొడ్డళ్లు, కొడవళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. జంగయ్య, అలివేల, పరమేశ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడ్డ వారిని వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నది.

కొనుగోలు కేంద్రాల వద్ద తడుస్తున్న ధాన్యం


కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు

ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తున్న కారణంగా కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొచ్చిన ధాన్యం తడిసి ముద్ద అవుతుం దని ధాన్యం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని వ్యవసాయ అధికారులు కొనుగోలు కేంద్రాలని ర్వాహకులు చెప్పడంతో ఆయా గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకొ చ్చి ఆరబెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో వర్షం ఎప్పుడు వస్తుందో తెలియక ఆరబెట్టుకున్న ధా న్యం తడిసి ముద్ద అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టుకున్న రైతులకు కొనుగోలు కేంద్రాలని ర్వాహకులు టార్పాలిన్లు ఇవ్వాలని జిల్లా అధికా రులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు నిర్వాహకులు పట్టించుకోవడం లేదని నిరాశకు గురవుతున్నారు.

కొనుగోలు వేగవంతం చేయాలి


టార్పాలిన్లు లేక తడిసిన ధాన్యం

ఆత్మకూరు మండలంలో జూరాల మూలమ ల్ల గుంటిపల్లి పన్నించర్ల మేడపల్లి దేవరపల్లి గ్రామాల్లో మండల మహిళా సమాఖ్య, సింగిల్ విండో శాఖల ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రా రంభించిన ఇప్పటికీ ఒక్క బస్తా కూడా కొనలేదు. దీని ద్వారా కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండిపోయి ఇతర రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదేంటని రైతులు నిర్వాహకులను ప్రశ్నిస్తే గన్నీ బ్యాగులు, మిల్లర్ల అలాట్‌మెంట్ రాలేదని, అలాగే తేమ శాతం అధికంగా ఉంది అని అనడమే తప్పా.. నిర్వాహకులు కొనుగోలు కేంద్రాలకు వచ్చి ధాన్యాన్ని పరి శీలించిన దాఖాలాలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు వేగవంతం చేస్తే ఆ స్థలంలో వేరే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకునే అవకాశం ఉందని, అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు వేగవంతం చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

కల్వర్టును ఢీకొన్న ట్యాంకర్

» తప్పిన ప్రాణాపాయం



వాగుపై కల్వర్టును ఢీకొన్న ట్యాంకర్

కృష్ణ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వాగుపై కల్వర్టును బూడిద లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్ ఢీకొనగా, ప్రాణాపాయం నుంచి డ్రైవర్ తప్పించుకున్నాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రం యాదగిరి నుంచి రాయచూర్ జిల్లా కర్ణాటక పవర్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ యాష్ తీసుకు వచ్చేందుకు బూడిద ట్యాంకర్ వెళ్తున్నది. ఈ క్రమంలో హిందూపూర్ గ్రామ శివారులో గల వాగుపై కల్వర్టును ఢీకొన్నది. అక్కడికక్కడే నిలిచిపోవడంతో డ్రైవర్ చాకచక్యంగా కిందకు దూకి ఎలాంటి గాయాలు కాకుండా తప్పించుకున్నాడు. అయితే, ఎదురుగా వాహనాలు వచ్చినట్లయితే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు అన్నారు. ఈ కల్వర్టుపై ప్రతీ రోజు వందల వాహనాలు వచ్చి వెళ్తాయని, రద్దీ ఉన్నట్లు అయితే ఘోర ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు అన్నారు.

కుక్కల దాడికి బలైన మేకలు

హన్వాడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోజురోజుకు కుక్కల బెడద పెరిగిపోతున్నది. ఇటీవల పలు గ్రామాల్లో ప్రజలను కుక్కలు భయపెడుతున్నాయి. మంగళవారం నాగంబాయితండాకు చెందిన బీమ్లానాయక్‌కు చెందిన మేకలు పొలం వద్ద ఉన్నాయి. అదే సమయంలో ఒకేసారిగా దాదాపుగా పది కుక్కలు మేకలపై దాడిచేశాయి. ఈ దాడిలో రెండు మేకలు, ఒక మేకపిల్లకు గాయాలయ్యాయి. గాయపడిన నాలుగు మేకలు బుధవారం చనిపోయాయి. అయితే గత మూడు నెలల క్రితం అదే తండాకు చెందిన నెహ్రూనాయక్ మేకలపై వీధి కుక్కలు దాడి చేశాయి. కాగా రెండు రోజుల క్రితం పెద్దదర్పల్లిలో కుక్కలు పలువురికిని గాయపరిచాయి.

గొర్లఖాన్‌దొడ్డిలో 25 గొర్రెలు..

గట్టు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో కురువ తిప్పన్న, కరువ వెంకటన్న, కురువ ఈరన్నలకు చెందిన దాదాపు 25 గొర్రెలు బుధవారం మృతి చెందాయి. గొర్రెలు మృతితో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. గొర్రెల మృతికి కారణం విషపు ఆహారం తినడం వల్లనే మృతి చెంది ఉంటాయని భావిస్తున్నారు. ఈ విషయం గట్టు మండల పశుసంవర్ధక శాఖ అధికారులకు చేరడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని గొర్రెల మృతిపై పరీక్షలు నిర్వహించారు. గొర్రెల మృతితో బాధిత రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి గొర్రెల రైతులకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగం పేరిట మోసం

గోపాల్‌పేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో ఓ మహిళకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోని వచ్చిన సంఘటనపై తెలిసిన వారు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఏదుట్ల గ్రామానికి చెందిన ఓ మహిళ వికలాంగురాలు... ఆమెకు మండల కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి నీకు మెడికల్ కాలేజీలో మెడికల్ మందులు పంపిణీ చేసే దాంట్లో ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. దీంతో ఆమె రూ.3 లక్షల వరకు డబ్బులు ఇచ్చింది. రోజులు గడుస్తున్నా సదరు మహిళ ఉదోగ్యం ఏమైంది అని అడిగినా దాటవేస్తూ వచ్చాడు. మోసపోయానని భావించిన సదరు మహిళ తన డబ్బులు తనకు ఇవ్వాలని కోరింది. దీంతో అతడు పలుమార్లు సమయం చెప్పి తప్పించుకొని తిరుగుతూ ఫైనల్‌గా కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లిపోయాడు. కాగా, ఈ సంఘటనపై బుధవారం 'ఆంధ్రజ్యోతి' పోలీసులను వివరణ కోరగా, బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి

చిన్నచింతకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో ఇద్దరు వ్యక్తులు వేర్వేరు చోట్ల అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కురుమూర్తి జాతరలో కొన్ని రోజులుగా యాచకునిగా జీవనం సాగిస్తున్న కర్నూల్ జిల్లా డోన్ మండలానికి చెందిన బాషా అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు.

అలాగే అమ్మాపూర్ గ్రామ శివారులో ఇనుప సామాన్లు, పేపర్లు సేకరించుకుని జీవనం కొనసాగిస్తున్న వ్యక్తి గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడు నర్వ మండలం చిన్నకడుమూర్ గ్రామానికి చెందిన మల్లేష్ (30)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరి మృతదేహాలను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచినట్లు ఎస్ఐ ఓబుల్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

వీపనగండ్ల/చిన్నచింతకుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా వీ పనగం డ్ల మండలం తూముకుంట గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడిన మంగదొడ్డి వెంకటేశ్వర్లు (70) బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం... వెంకటేశ్వర్లు కాలుకు రెండు సంవత్సరాల క్రితం గాయమైంది. సెఫ్టిక్ కావడంతో కాలు కొట్టేసే పరిస్థితులు వచ్చాయి. రెండు సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇతను జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం ఇంటి వెనుకకు వెళ్లి గడ్డిమందు తాగి ఇంట్లోకి వెళ్లాడు. చివరి రోజు పూలు బొట్టు పెట్టుకోమని రోధించాడు. ఏమైందని భార్య దగ్గరికి వెళ్లగా, వాసన రావడంతో మందు తాగినట్లు గమనించి కేకలు వేసింది. చుట్టు పక్కల వారు వచ్చి వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్ఐ రాణి తెలిపారు.

పర్దిపూర్‌కు చెందిన వ్యక్తి..

● చిన్నచింతకుంట మండలం పర్దిపూర్ గ్రామానికి చెందిన వడ్ల బాల కృష్ణ (17) అనే యువకుడు బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పూర్తి చేసి ఇంటి దగ్గరే ఉంటూ కూలీ పనులు చేసుకుని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండే వాడు. అయితే ఇదే క్రమంలో గత నెల 19వ తేదీన గ్రామంలో క్షణికావేశంలో పురుగుల మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించగా, కోలుకోలేక చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తల్లి వడ్ల మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చిన్నచింతకుంట పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు కోనేటిలో పడి వృద్ధురాలు..

జడ్చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని వేంకటేశ్వరకాలనీకి చెందిన నాసు సాయమ్మ(60) కోనేటిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా.. మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన సాయమ్మ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె కుమారుడు నాసు రవికుమార్ పరిసర ప్రాంతాల్లో ఆచూకీ కోసం ప్రయత్నించినా, లభించలేదు. సాయమ్మ కల్లు తాగే అలవాటు ఉండడంతో ఇప్పటికే రెండు, మూడు పర్యాయాలు వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద నిద్రపోయేదని, రవికుమార్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కాగా బుధవారం ఉదయం 8.30గంటల సమయంలో కోనేటిలో సాయమ్మ మృతదేహం ఉందంటూ స్థానికులు కుమారిడికి సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి చూశారు. ప్రమాదవశాత్తు కోనేటిలో పడి మృతిచెంది ఉంటుందని ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడ్తున్నట్లు జడ్చర్ల సీఐ తెలిపారు.

దొంగలకు అడ్డాగా..

● జోగుళాంబ గద్వాలలో చోరీలతో భయాందోళన

» ఇటీవలే షేరెల్లివీధిలో చోరీ

» అదే కాలనీలో దొంగతనం... ఆపై మహిళ హత్య?

» అంతలోనే ఐడీఎస్ఎంటీ కాలనీలో దొంగతనానికి యత్నం

» పోలీసుల నిఘా లోపమే కారణమా!



గద్వాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం దొంగలకు అడ్డాగా మారిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. దొంతనాలు, దొంగతన యత్నాలు, హత్య చేస్తూ నేరుగా పోలీసులకు దొంగలు సవాళ్లు విసురుతున్నారు. ఇందుకు పోలీసులు మాత్రం పట్టించుకునే స్థితిలో లేనట్లు తెలుస్తున్నది. గత నెల 21న షేరెల్లివీధిలో అహ్మద్ అనే వ్యక్తి ఇంట్లో రూ. 50 వేల నగదుతో పాటు వస్తువులు దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం అదే షేరెల్లివీధిలో బలిజ లక్ష్మి అనే మహిళ ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు ఆమెను హత్యచేసినట్లు తెలుస్తున్నది. అంతలోనే తాజాగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐడీఎస్ఎంటీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి వెంకట్రాములు అనే ఉపాధ్యాయుడు ఇంట్లో దొంగతన యత్నం చేశారు. ఈ క్రమంలో తలుపును రాడ్‌తో తీసి లోపలికి ప్రవేశించారు. ఒక్కసారిగా జరుగుతున్న ఈ సంఘటనలతో గద్వాల పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



● చర్యలు తీసుకుంటాం

పట్టణంలో కొంతకాలంగా జరుగుతున్న దొంగతనాలపై నిఘా ముమ్మరం చేశాం. పాత నేరస్థులపై నిఘా పెట్టాం. షేరెల్లివీధిలో మహిళ అనుమానాస్పద మృతిపై విచారణ చేపడుతున్నాం. త్వరలోనే అన్ని విషయాలను వెల్లడిస్తాం. దొంగతనాలను పూర్తిగా నివారించేలా పోలీస్ గస్తీని ముమ్మరం చేస్తాం.

- టంగుటూరి శ్రీను, సీఐ, గద్వాల

● మహిళ మృతిపై వీడని మిస్టరీ

గత ఐదు రోజుల క్రితం షేరెల్లివీధిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ బలిజ లక్ష్మి మృతిపై మిస్టరీ వీడటం లేదు. అయితే మొదట బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు, కడియాలు దొంగలు ఎత్తికెళ్లి హత్య చేసి ఉంటారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే పోలీసుల విచారణలో ఆ ఆభరణాలు ఇంటిలోనే లభ్యమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. బలిజ లక్ష్మి వడ్డీలకు డబ్బులు ఇచ్చేదని, ఈ క్రమంలో అప్పు లు తీసుకున్న వారు హత్యచేశారా...? లేక దొంగలు ఇంట్లోని వస్తువులను తీసుకెళ్లి హత్య చేశారా? అన్న అనుమానాలు ఉన్నాయి. ఏది ఏమైనా దొంగతనాలు, యత్నాలతో పాటు మహిళ హత్యకు సంబంధించిన సంఘటనలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సర్వీస్ రోడ్డులోకి రాని ఆర్టీసీ బస్సులు

- ప్రయాణికులకు తప్పని తిప్పలు



హైవేపైన ఆగిన ఆర్టీసీ బస్సు

భూత్పూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ఉన్న గ్రామాలకు నేషనల్ హైవే అథారిటీ వారు ప్రమాదాలు జరగకూడదన్న ఆలోచనతో జాతీయ రహదారులపై ఉన్న గ్రామాలకు సర్వీసు రోడ్లను ఏర్పాటు చేశారు. నాటి నుంచి ఒక్క రోజు కూడా ఆర్టీసీ బస్సులు సర్వీస్ రోడ్ల మీదకు రావడం లేదని, హైవేపై నుంచే బస్సులు వెళుతున్నాయని జాతీయ రహదారిపై ఉన్న గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

దేవరకద్ర నియోజకవర్గంలోని అన్నసాగర్, జానంపేట, కొమిరెడ్డిపల్లి, షాఖాపూర్, అడ్డాకుల, భూత్పూర్ తదితర గ్రామాలకు నేషనల్ హైవే అథారిటీవారు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడవడానికి సర్వీసు రోడ్లను జాతీయ రహదారి విస్తరణ సమయంలో ఏర్పాటు చేశారు. అయితే అన్నసాగర్, జానంపేట గ్రామాలకు మాత్రం ఆ నిబంధనలు ఆర్టీసీ అధికారులు పాటించక పోవడంతో ఆయా గ్రామాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.


జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు కోసం వేచిఉన్న ప్రయాణికులు

ముఖ్యంగా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు హైవేపైకి రావడానికి అనేక పాట్లు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు తెలుపుతున్నారు. అడ్డాకుల, షాఖాపూర్, కొమిరెడ్డిపల్లి, భూత్పూర్ గ్రామాలకు మాత్రం సర్వీస్ రోడ్ల మీదకు ఆర్టీసీ బస్సులు వస్తున్నాయని ఆయా గ్రామాల ప్రయాణికులు తెలిపారు. అన్నసాగర్, జానంపేట గ్రామాలకు ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్లపై ఆర్టీసీ బస్సులు రావడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. హైవేపై బస్సులు ఆగడంతో తరచూ ప్రమాదాలు జరుతున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి సర్వీస్ రోడ్లపై రాని ఆర్టీసీ బస్సులను వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● రోడ్డు ఎత్తుగా ఉంది...



వృద్దులు, చిన్నపిల్లలు, మహిళలు ఎత్తుగా ఉన్న రోడ్డు మీదకు రావాలంటే చాలా ఇబ్బందులు అవుతుంది. సర్వీస్ రోడ్డుల మీద బస్సులు వస్తే చాలా బాగుంటది. చదువుకోవడానికి వెళ్లే పిల్లలకు చాలా ఇబ్బంది అవుతుంది. ఎవరూ పట్టించుకోవడం లేదు.

- ఇందిరమ్మ, అన్నసాగర్

● ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేదు



సర్వీస్ రోడ్ల వెంబడి ఆర్టీసీ బస్సులు రావడం లేదని పలు మార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించిన లాభం లేదు. ఎవరైనా పెద్దవాళ్లు చెబితే వారం రోజులు వస్తాయి.. మళ్లీ పాత అలవాటుకే పోతాయి. పలు మార్లు ప్రమాదాలు కూడా జరిగాయి.

- ఆంజనేయులు, అన్నసాగర్

ఖోఖో క్యాంపు ముగింపు

కల్వకుర్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో 12రోజులుగా జరుగుతున్న 58వ సీనియర్ ఖోఖో బాలుర, బాలికల క్యాంపు ముగిసింది.

ముగింపు సందర్భంగా బుధవారం శిబిరాన్ని సామాజికవేత్త రాము, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ కోశాధికారి మధుకుమార్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు గోకమళ్ల రాజు, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన యువకుడు

కోడేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కోడేరు మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సౌటపట్ల మద్దిలేటి, మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు సింగోటం నుంచి కోడేరుకు బైక్‌పై వస్తుండగా కోడేరు సమీపంలోని సబ్ స్టేషన్ దగ్గర బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి వారిని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఆరబోశారిలా.. పోయేదెలా?

- రోడ్డుపైనే ధాన్యంతో వాహనదారు ఇక్కట్లు

» వాహనదారులకు, ప్రయాణికులకు ప్రమాదాలు

» ఎదురుగా వచ్చిన వాహనాలకు సైడు లేక ప్రమాదాలు

» పట్టించుకోని అధికారులు


రోడ్డుపైనే ఆరబెట్టిన ధాన్యం

కోడేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఆరబెట్టడానికి జాగలేక రోడ్డు మీద ఇలా పోస్తే.. పోయ్యేదెలా అంటూ ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మీద ధాన్యం ఆరబెట్టడంతో పాటు రాత్రిపూట నల్లని కవర్లు కప్పుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, పెద్ద పెద్ద వాహనాలు వెళ్లాలంటే సైడ్‌కు ఎలా వెళ్లాలో తెలియక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపైన ధాన్యం పోయడం ప్రమాదమని తెలిసినా కూడా రైతులు అలాగే చేయడం నిత్య ప్రక్రియగా మారింది. జనుంపల్లి శివారులో మంత్రాలమ్మ గుడి దగ్గర ఇద్దరు చనిపోయిన సంఘటనలు తెలిసిందే. రాత్రి పూట ద్విచక్ర వాహనంపై ఓ వ్యక్తి కోడేరు నుంచి జనుంపల్లి వెళ్తుండగా ట్రాక్టర్ ఎదురు రాగా బైకు సైడుకు వెళ్లింది. పక్కన ధాన్యం కుప్ప నల్లటి కవర్ కప్పి ఉం చింది.. కనిపించకపోవడంతో ధాన్యం కుప్ప ఎక్కి బైక్ వెళ్లి ఒకరు చనిపో యారు. ఇలా జరిగిన కొద్ది రోజులకే ఆ రోడ్డు మీదనే ధాన్యం ఆరబెడుతుం డగా బైక్ అదుపు తప్పి మహిళ మృ తి చెందింది. ఇలా ఎన్నో ప్రమాదాలు జరిగినా రోడ్డు మీద ధాన్యం ఆరబెటడం మాత్రం జరుగుతూనే ఉన్నది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు రోడ్డుపై ధాన్యం ఆరబెట్టరాదని అవగాహన కల్పించడంతో పాటు రైతులకు ప్రత్యామ్నాయంగా స్థలాలను చూపించాల్సి ఉంది. గతంలో మాదిరిగా ప్రతీ రైతుకు కల్లాలకు ప్రభుత్వం సహాయం అందించి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రోడ్డు మీద ధాన్యం ఆరబెట్టిన వారిపై చర్యలు తీసుకోండి



రోడ్డు మీద ధాన్యం అరబెట్టడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అయి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మీద ధాన్యం ఆరబెట్టిన వారిపైన చర్యలు తీసుకోవాలి. ధాన్యం రోడ్డు మీద ఆరబెటడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు వెళ్లడానికి వీలేకాక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట రోడ్డు మీదనే ధాన్యం కుప్పలు ఉంచి వాటి పైన నల్లటి కవర్లు కప్పడంతో వాహనదారులకు తెలియక కనిపించక ధాన్యం కుప్పలు ఎక్కి కింద పడి ప్రమాదాలో చనిపోతున్నారు. అధికారులు వారిపై చర్యలు తీసుకొని రోడ్డుపైన ధాన్యం ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలి.

- ఎం.శ్రీనివాస్‌యాదవ్, జనుంపల్లి

సంగంబండ రిజర్వాయర్ గేటు ఎత్తి నీటి విడుదల


దిగువకు వెళ్తున్న సంగంబండ జలాశయం నీరు

మక్తల్‌రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం 1 గేటు ఎత్తి అధికారులు నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద నీటి ఉధృతి పెరగడంతో బుధవారం 1 గేటు ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. జలాశయంలోకి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 500 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని, రిజర్వాయర్ నీటి పూర్తి సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.78 టీఎంసీలు ఉందని ఇరిగేషన్ డీఈఈ సురేష్ తెలిపారు.

9న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సభ


ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సభ కరపత్రం విడుదల చేస్తున్న అధ్యక్షుడు కర్ణ

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో గల గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 9 ఉమ్మడి జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆత్మీయ సభ నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ ప్రెసిడెంట్ ఏను పోతుల కర్ణ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సభకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం హాజరును కానున్నట్లు చెప్పారు. ఏజెన్సీ వ్యవస్థ రద్దు, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై సభలో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కవిత, గోపాల్, అనిత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

951 మిలియన్ యూనిట్లకు చేరిన జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో బుధవారం నాటికి 951 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ దిగువ ఉత్పత్తి కేంద్రాలలో 12 యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని చేపడుతున్నట్లు ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 6 యూనిట్లు ప్రారంభించి 3.084 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటి వరకు 481 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో 6 యూనిట్లు ప్రారంభించి 3.100 మిలియన్ యూనిట్లను చేపట్టిన ట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

తిమ్మాజిపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట మండల పరిధిలోని లోట్లోనితండాకు చెందిన ముడావత్ పార్వతి అలియాస్ జయలక్ష్మి అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా.. రేవల్లి మండలం పాతతండాకు చెందిన పార్వతిని లక్ష్మణ్‌నాయక్‌తండా గ్రామపంచాయతీలోని లోట్లోనితండాకు చెందిన ముడావత్ రాజుకు ఇచ్చి వివాహం చేశారు. భర్త రాజు హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేసుకుంటుండగా, సదరు మహిళ ఇద్దరు కూతుళ్లతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఈ నెల 4న ఇంట్లో ఎవరికీ తెలియకుండా వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకలేదు. బుధవారం సదర మహిళ తండ్రి బిక్యా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రెడిట్‌కార్డు అప్డేట్ చేస్తామంటూ..

» రూ.96,800 డ్రా » సైబర్ క్రైమ్‌పై కేసు నమోదు

ఊర్కొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైంపై కేసు నమోదు చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన మాదుగుల బాలరాజుకు గత నెల 16వ తేదీన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి కాల్ చేస్తున్నామని, మీ క్రెడిట్ కార్డ్ అప్డేట్ చేస్తామని తెలిపారు. దాంతో అతడు కొన్ని విషయాలు తెలియజేయగా, అందులో భాగంగా ఓటీపీ చెప్పమని వారు అడగడంతో చెప్పాడు. వెంటనే ఎస్‌బీఐ క్రెడిట్ కా ర్డులో నుంచి రూ.96,800 డ్రా అయినట్లు మెసేజ్ రావడం జరిగిందని, వెం టనే బాధితుడు సైబర్ క్రైమ్ జరిగినట్లు ఉందని అంచనాకు వచ్చి 1930కు కాల్ చేశాడు. బుధవారం పోలీస్ స్టేషన్ చేరుకొని ఫిర్యాదు చేయగా సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

లారీ, కారు ఢీ

జడ్చర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ముందుగా వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టిన సంఘటన 44వ నెంబరు జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల పట్టణానికి చెందిన కుటుంబసభ్యులు కారులో హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. జడ్చర్ల మండలం బురెడ్డిప ల్లి సమీపంలోని ఎఫ్‌సీఐ గోదాముకు వెళ్లే దారి వద్ద వెనుకనుంచి వచ్చిన లారీ, కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. కారు పూర్తిగా దెబ్బతిన్నది. సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి గల్లంతు

గద్వాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండల పరిధిలోని రేకులపల్లి వద్ద చేపల వేటకు వెళ్లిన సలీం(15) గల్లంతైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని బీడి కాలనీకి చెందిన సలీం ఉదయం చేపల గాలం తీసుకొని రేకులపల్లి వద్ద ఉన్న గుండాల జలపాతం వద్దకు వెళ్లాడు. గాలం వేసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడిపోయాడు. విషయం తండ్రి మౌలాలికి తెలియడంతో కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లారు. రాత్రి కావడంతో వెనుతిరిగి వచ్చి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గల్లంతైన సలీం కోసం ఉదయమే జాలర్లతో గాలింపు చర్యలు చేపడుతామని ఎస్ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

● హన్మంతురెడ్డి, ఏవో



గట్టు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ మండల అధికారి హన్మంతురెడ్డి అన్నారు. దీనికోసం రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తెలిపారు. అలాగే పలు విషయాలు వివరించారు.

ఎలాంటి పనిముట్లు అందజేస్తున్నారు.?

మండలంలో 69మంది రైతులు దరఖాస్తులు సమర్పించారు. రోటోవేటర్, స్ప్రేయర్స్, స్ట్రాబ్లెలర్, బ్రెస్‌కట్టర్ వంటివి ఇవ్వనున్నాము.

మట్టి పరీక్షలు చేస్తున్నారా?

ప్రతీరైతు తన పొలంలో భూసార పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలి. ఇప్పటివరకు 6,055 మంది రైతుల పొలాల్లో మట్టి నమూనాలు సేకరించాము. పరీక్షలకు పంపాము. త్వరలోనే ఏఈవోల ద్వారా రిపోర్టులు అందిస్తాం.

మండలంలో యూరియా స్టాక్ ఉన్నదా?

ప్రస్తుతానికి యూరియా కష్టాలు తీరినట్లే. అవసరమైన ప్రతీరైతుకు యూరియా అందించాం. రైతులు దిగులు చెందాల్సిన పనిలేదు.

వర్షాల వల్ల పంటనష్టం జరిగిందా?

మండలంలో ప్రధాన పంటలకు నష్టం వాటిల్లింది. పత్తి, వరి, మొక్కజొన్న చేతికొచ్చిన సమయంలో వర్షాలు కురిశాయి. దీంతో రైతులకు పంటనష్టం జరిగింది.

న్యూస్ బాక్స్

ఆదిశిలా క్షేత్రంలో న్యాయాధికారి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తున్న న్యాయాధికారి హైమావతి

మల్దకల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని గద్వాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నేరెళ్ల వెంకట హైమావతి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దేవాలయాన్ని చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న న్యాయాధికారి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం నిర్వాహకులు ఆమెకు స్వామి వారి శేషవస్త్రం ప్రసాదం అందజేశారు.

విద్యార్థులు ఎక్కే ప్రతీ స్టేజీ వద్ద బస్సు ఆపాలి

● ఆర్టీసీ డీఎంకు బీఆర్‌ఎస్వీ వినతి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

గద్వాల అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎక్కే ప్రతీ స్టేజీ వద్ద తప్పనిసరిగా బస్సులను ఆపేలా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ నాయకులు గద్వాల ఆర్టీసీ డిపో మేనేజర్ సునీతకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే సమయాల్లో స్టేజీల వద్ద బస్సుల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్న సమయాల్లో కొందరు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బస్సులను ఆపకుండా వెళ్తున్నారని డీఎంకు వివరించారు. పర్దీపురం స్టేజీ వద్ద బస్సును ఆపకపోవడం వల్లే విద్యార్థులు ధర్నా చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కో-ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య, నాయకులు నర్సింహులు, రఘు, చిన్న, రంగస్వామి, కృష్ణ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు మళ్లీ బ్రేక్

● నిరవధిక సమ్మెలో కాటన్ మిల్లు యజమానులు

అలంపూరు చౌరస్తా, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని అమ్ముకునేందుకు నానా యాతన పడుతున్న సమయంలో పిడుగులాంటి వార్త వినాల్సివచ్చింది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు నడుస్తున్న కాటన్ మిల్లు యజమానులు తమ తమ డిమాండ్ల పరిష్కారం కోసం గురువారం నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఉండవల్లి మండల పరిధిలోని శ్రీ వరసిద్ధి వినాయక కాటన్ మిల్లు యజమానులు ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఐ ఇబ్బందికర నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని, రైతులు సహకరించాలని కోరారు. దీంతో ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న రైతుల పత్తి, స్లాట్ల కోసం ఎదురుచూస్తున్న రైతుల పరిస్థితి అయోమయంలో పడింది. ఇప్పటికే వర్షాలతో సతమతం అవుతున్న రైతులకు ఇది పిడుగులాంటి వార్తే.



గద్వాలసర్కిల్ : గద్వాలలోని శివాలయం వద్ద దర్శనానికి బారులుదీరిన భక్తులు



గద్వాలసర్కిల్ : కృష్ణానది తీరాన దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ఇటిక్యాలలో సామూహికంగా దీపాలు వెలిగించి, పూజలు చేస్తున్న మహిళలు



ఇటిక్యాలలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచే ప్రజలు ఆలయాలకు వెళ్లి దైవ దర్శనాలు చేసుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. కృష్ణానది, తుంగభద్ర నదీతీర గ్రామాల్లోని ఆలయాల్లోనూ దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.



అయిజ మండలంలో వేణిసోంపూర్‌లో తుంగభద్ర నదిలో స్నానాలు చేస్తున్న భక్తులు

మల్దకల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన స్వయం భూ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి శుభసందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచే ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని దేవాలయ అధికారులు శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తిరుపతిలో నిర్వహించినట్లుగా ఆగమ శాస్త్ర పద్ధతిలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడిని కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా అశేష భక్తుల సమక్షంలో నిర్వహించారు. కల్యాణం జరిపించిన కొండపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు దంపతులను ఆలయ అధికారులు సన్మానించారు. కార్యక్రమ నిర్వహణలో పండితులు మదుసూదనాచార్యులు, రమేశాచార్యులు, ధీరేంద్రదాసులు, రవిఆచార్యులు పాల్గొన్నారు.



అయిజ మిట్టరామేశ్వరాలయంలో వేకువ జామున కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

500 గ్రాముల వెండి వితరణ

దేవాలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ అధికారులు 108 కిలోల వెండి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఆ కార్యక్రమానికి భక్తుల నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది. ఇందులో భాగంగా బుధవారం మల్దకల్‌కు చెందిన మడ్డిబావి నర్సింహులుగౌడు కుటుంబ సభ్యులు 500 గ్రాముల వెండిని దేవాలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డికి అందజేశారు.

మానవపాడు మండలంలో..

మానవపాడు: మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు స్థానిక శివాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ముఖ్యంగా యువతీ, యువకులు ఆలయాల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. తుంగభద్ర నదితీరంలోని మద్దూరు వద్ద భక్తులు నదిలో స్నానాలు ఆచరించి శివయ్యను రూపొందించుకుని దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

నదీ అగ్రహారంలో

గద్వాలసర్కిల్ : కార్తీకమాస పౌర్ణమి వేడుకలు బుధవారం గద్వాలలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే భక్తులు గద్వాలకు సమీపంలోని నదీ అగ్రహారంలో ఉన్న కృష్ణానదికి చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. నదీ తీరాన మహిళా భక్తులు దీపాలు వెలిగించి నదీలోకి వదిలారు. నదీ తీరంలో ఉన్న శివాలయంతో పాటు జిల్లా కేంద్రం నల్లకుంట, తెలుగుపేట, సెకండ్ రైల్వే గేట్‌లో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇటిక్యాల మండలంలో..

ఇటిక్యాల: కార్తీక పౌర్ణమి ని పురస్కరించుకొని బుధవారం ఇటిక్యాల మండలంలో ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షతో ప్రత్యేక పూజలు చేశారు. ఇటిక్యాల శివాలయంలో దీపాలు వెలిగించి భక్తులు అభిషేకం, ఆకుపూజలు చేశారు. మండలంలోని షాబాద, చాగాపురం, ఉదండాపురం ఆలయాల్లో, వావిలాల శివాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



జములమ్మ ఆలయంలో ఎమ్మెల్యే బండ్లకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

జములమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

గద్వాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జములమ్మ ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో పురేందర్‌కుమార్, ఆలయ చైర్మన్ వెంకట్రాములు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



చెక్కును లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కే.టి.దొడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో నడిపి జయన్నకు రూ.60 వేలు, చాకలి జమ్ములమ్మకు రూ.48 వేలు, కుర్వ నర్సమ్మకు రూ.44 వేలు, రాధికకు రూ.26 వేలు, నవితకు రూ.24 వేలు, కంసలి రమేశ్‌కు రూ.18 వేలు, శాంతాజీకి రూ.17,500 చెక్కులు పంపిణీ చేశారు. అలాగే గట్టు మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హనుమంతు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, నాయకులు రమేశ్‌రెడ్డి, ఉరుకుందు, యుగంధర్‌గౌడు, చంద్రశేఖర్, నాగేంద్రయాదవ్, నర్సింహులు ఉన్నారు.

గుంతల రోడ్లపై అవస్థల ప్రయాణం



చెన్నిపాడు వెళ్లే బీటీ రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలు

మానవపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. ముఖ్యంగా మానవపాడు నుంచి కలుకుంట్ల, చెన్నిపాడు, పెద్దపోతులపాడు గ్రామాలకు వెళ్లే బీటీరోడ్డుపై ప్రయాణం నరకమేనని వాహనదారులు వాపోతున్నారు. రోజురోజుకూ ఆ రోడ్డుపై ప్రయాణం తగ్గిపోతుంది. బైక్‌పై వెళ్లాలంటేనే ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. భారీ వాహనాలు, ట్రాక్టర్లు ఈ దారిలో వెళ్లేందుకు మొగ్గు చూపడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి మట్టితో గుంతలను పూడ్చించాలని ప్రయాణికులు, మండల ప్రజలు కోరుతున్నారు.

క్రిమిసంహారక మందులు అధికంగా వాడితే ఇబ్బందులు

● జయశంకర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త అనిత

ఇటిక్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) పంటలకు క్రిమిసంహారక మందులు అధికంగా పిచికారీ చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని జయశంకర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త అనిత చెప్పారు. బుధవారం ఇటిక్యాల మండలంలోని సాతర్ల గ్రామంలో మిరప పంటలను బంగ్లాదేశ్ చెందిన వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలతో కలిసి ఆయన పరిశీలించారు. రైతులకు పలుసూచనలు చేశారు. మిరపలో చీడపీడల నివారణకు అధిక శాతం పురుగుల మందు వాడకం వల్ల పర్యావరణ సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అయిజ ఫార్మర్ ప్రొడక్షన్ కంపెనీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సుధాకర్‌గౌడ్, వినీత్, రఘురాంరెడ్డి ఉపేంద్ర, వీరబాబు, సాతర్ల గ్రామ రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్టీఎఫ్ బృందం ఆకస్మిక దాడులు

● పలు మద్యం దుకాణాల్లో తనిఖీలు

గద్వాల క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం సాయంత్రం ఎస్టీఎఫ్ బృందం సభ్యులు (స్టేట్ టాస్క్ ఫోర్స్) ఆకస్మికంగా పలు మద్యం దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని జమ్మిచేడులో ఉన్న మద్యం దుకాణానికి వెళ్లి అక్కడ తనిఖీలు చేపట్టారు. అయితే దుకాణంపై ఫిర్యాదు రావడంతో ఈ టీం సభ్యులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తుంది. ఇందులో ఉన్న మద్యం వివరాలను సేకరించడంతో ఇతర ప్రాంతాలకు చెందిన మద్యం ఉందా అనే విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం. అంతేకాకుండా మద్యం బాటిల్స్‌పై ఉన్న క్యూఆర్‌కోడ్‌లను పరిశీలించారు.

మద్యం బాటిల్స్ ఏవేవి, ఎన్నెన్ని ఉన్నాయనే వాటిపై ఆరాతీసి రికార్డులో పొందుపరిచారు. అనంతరం జిల్లాలోని మరికొన్ని మద్యం దుకాణాలను తనిఖీ చేసి వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

పల్లెపల్లెకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు



ఎక్లాస్‌పూర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ

అయిజ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్లెపల్లెకు బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ తెలిపారు. గడప గడపకూ బీజేపీ సంక్షేమ పథకాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం అయిజ మండల పరిధిలోని ఎక్లాస్‌పూర్‌లో పార్టీ తరఫున పర్యటించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, సన్నబియ్యం, రైతువేదికల నిర్మాణం, పంట సాగుకు రైతులకు అందిస్తున్న ప్రోత్సాహం గురించి ప్రజలకు వివరించారు. బీఆర్‌ఎస్ కుటుంబ పాలనతో అవినీతి అక్రమాలకు పాల్పడి రాష్ట్రాన్ని దివాళా తీయించారని విమర్శించారు. ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరచకుండా మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. బీజేపీతోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధికారం చేజిక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివన్న, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

కొత్తరకం వరి వంగడంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న జీఎం ఇంద్రసేనారెడ్డి

గద్వాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంటిపల్లి గ్రామంలో బుధవారం అజిత్ సీడ్స్ కంపెనీ జనరల్ మేనేజర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌బీ-20 అనే కొత్త రకం వరి వంగడంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రకం వరి వంగడం తక్కువ ఖర్చుతో సాగుచేసి అధిక దిగుబడి పొందవచ్చని సూచించారు. అదేవిధంగా తెగుళ్లను తట్టుకునే శక్తి కూడా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచు రాణి మన్నెస్వామి, మాజీ ఉపసర్పంచు చంద్రాములు, శ్రీరాజేశ్వరి ట్రేడర్స్ యజమాని రాంరెడ్డి, కంపెనీ మేనేజర్ రాజు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీలకు చేరిన పాఠ్య పుస్తకాలు



అయిజ పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో ఉన్న పాఠ్య పుస్తకాలు

అయిజ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్య పుస్తకాలు ఎమ్మార్సీలకు చేరాయి. జిల్లాకేంద్రం నుంచి మండలాల్లోని ఎమ్మార్సీలకు వీటిని అందజేశారు. ప్రస్తుతం అయిజ ఎమ్మార్సీ భవనంలో పాఠ్య పుస్తకాలు ఉన్నాయి. అయిజ మండల పరిధిలోని గ్రామాలతో పాటు, పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు వీటిని అందించనున్నారు. 33 ప్రాథమిక, 14 ప్రాథమికోన్నత, 12 ఉన్నత ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో దాదాపు 8,300 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల ప్రారంభంలో మొదిటి భాగానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయి. గత అక్టోబరు 31తో ఎస్‌ఏ-1 పరీక్షలు సైతం పూర్తయ్యాయి. ప్రస్తుతం రెండవ భాగానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు దసరా నాటికి అందాల్సి ఉంది. కాస్త ఆలస్యం అయ్యింది. ప్రస్తుతం రెండవ భాగానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీలకు చేరటం జరిగింది. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సబ్జెక్టుల వారీగా మాత్రమే పుస్తకాలు అందాయి. ప్రస్తుతం 21,114 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 8,350 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. 6న గురువారం నుంచి ఆయా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించనున్నట్లు మండల విద్యాధికారి రాములు తెలిపారు.

అధిక వర్షాలతో చేతికిరాని మెట్ట పంటలు



ఇటిక్యాల శివారులో పత్తి పంటలో నిలిచిన వర్షం నీరు



ఇటిక్యాల వద్ద ఎండిన కంది పంట

ఇటిక్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో వానాకాలం సాగు రైతులకు నష్టాలు, కష్టాలను మిగిల్చింది. మండలంలో వేల ఎకరాల్లో వానాకాలం పంట సాగులో భాగంగా పత్తి, మిరప, కంది పంటలు సాగు చేశారు. ఇటిక్యాల మండలంలో సాగునీటి పథకాలు లేని కారణంగా అధికంగా వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. ఈసారి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంటలు ఎండిపోయాయి. వేల రూపాయలు వ్యయం చేసి పంటలు సాగు చేయగా అధిక దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని, దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. మండలంలో పత్తి 15,500 ఎకరాలు, వరి 1861, కందులు 3620, వేరుశనగ 80, మొక్కజొన్న 55, పొగాకు 1990, మిరప 2850 ఎకరాల్లో సాగు చేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు. పత్తి పంట అధికంగా నష్టం జరిగిందని తెలిపారు.

మండలంలో అధికంగా నల్లరేగడి భూములు ఉండడంతో రైతులు వాణిజ్య పంటలపైనే ఆసక్తి పెంచుకోవడంతో అధిక వర్షాలు నట్టేట ముంచాయి. వర్షాలు తగ్గితే నష్టపోయిన పంటలను తొలగించి రబీ పంటల సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారు. రబీ, జొన్న, పప్పుశనగ, మొక్కజొన్న, పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

రబీ పంటలపైనే ఆశలు

వానాకాలంలో ఎన్నో ఆశలతో పత్తి పంట సాగు చేశాను. అధిక వర్షాలతో పంట నిలువునా ముంచింది. నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాను. చేసిన కష్టం, పెట్టుబడి అంతా చేతికిరాకుండా పోయింది. అప్పులు మిగిలాయి.

\- సురేందర్, ఉదండాపురం